


# రేపు కనిపించు

— మెట్లపల్లి కామేశ్వర శర్మ

"ఏమైనా సరే ఎం. ఏ. చదవాలి." మరోసారి నిరుత్సాహాన్ని దులిపేసుకుని సడలిపోతున్న పట్టుదల కూడగట్టుకుని ఎం. ఏ. చదివే మార్గంకోసం ఆలోచించటం మొదలు పెట్టాడు సత్యం.

బి. ఏ. లో కాలేజీకి అతని దొక్కడిదే ఫస్ట్ క్లాస్. అంతేకాదు, చదువులో ఇంతవరకూ ఆ హోదాకి అతనొక్క మెట్టు దిగలేదు. ఇది స్ఫురించిన ప్రతిసారీ అతనిలో ఆత్మవిశ్వాసం పెల్లుబుకుతూంది.

అవును! ఒక్క మెట్టు! మరొక్క మెట్టు ఎక్కెయ్యాలి. తన సామర్థ్యాన్ని పెంచుకోవాలి. పెంచుకుని, స్కాలర్‌షిప్స్ ఇచ్చి ఈ మెట్లన్నీ ఎక్కించిన సమాజానికి తన యావచ్ఛక్తితో సాయపడి ఋణం తీర్చుకోవాలి. తీర్చుకుని తన ప్రయోజనం ఋజువు చేసుకోవాలి.

కాని, ముందు కనీసం మూడు వందలు కావాలి! ఆ అవసరం స్ఫురించిన ప్రతిసారీ అతనిలో తెర్లిపోతున్న ఉత్సాహం చప్పగా చల్లబడి పోతూంది.

మొండిగా ఆ మూడు వందలను గురించే వీరయ్య సైకిల్ షాప్‌లో కూర్చుని అతను ఆలోచిస్తున్నాడు.

"ఇంకా సదువేంటెహె! ఆడ నీ అయ్య హోటళ్లలో పిళ్లు రుబ్బలేక సస్తా ఉంటే!" — మధ్య మధ్య పరిస్థితిని జ్ఞాపకంచేస్తూ వీరయ్య తన పగటి కలల్ని ఈనడిస్తున్నాడు.

సత్యం జావకారి పోతున్నాడు. 'లాభంలేదు! చదువు మానేస్తాను' అనుకుంటున్నాడు.

అనుకుంటున్న మరుక్షణంలో అతని కొక ప్రశ్న మరుక్కున జ్ఞాపకం వస్తూంది. 'ఆశ చంపేసుకున్న మనిషికి బతుకు తాలూకు ప్రయోజనం ఏమిటి?' ఆ ప్రశ్న జ్ఞాపకం రాగానే అతను సిగ్గుపడుతున్నాడు.

'ఆశని చావనివ్వకూడదు. బ్రతుకుకి ఉన్న అవసరాన్ని నాశనం చేసుకోకూడదు. పట్టుదలతో ప్రతి క్షణాన్నీ వాడుకుని బ్రతుకుని సార్థకం చేసుకోవాలి' అని మొండిగా నిశ్చయించుకుంటున్నాడు.

కాని, ఈ ఆశని బ్రతికించే దెట్లా? అప్పు అడిగా? ముష్టి అడిగా? అమ్మో! మూడు వందలు! హోటల్లో పిండిరుబ్బే కిష్టయ్య కొడుక్కి మూ . . . డు . . . వం ... ద ... లు ...!

ఎవ రిస్తారు? ఎవరు? ఎవరు?

అతను పిచ్చిగా, మొండిగా వెతుక్కుంటున్నాడు.

ఎట్టకేలకు, ఆ రోజంతా బుర్ర బద్దలు చేసుకుంటే, కటిక చీకట్లో సన్నని మెరుపులా అతని మస్తిష్కంలో తళుక్కుమన్నాడు సీతాపతి.

బలమంతా కూడగట్టుకుని తారు రోడ్డు మీద ఎదురుగాలిని చీల్చుకుంటూ ముందుకు సాగిన సైకిల్ మలుపు తిరిగి మట్టి రోడ్డుని చూసి నీళ్లు కారిపోయింది. వైతరిణి లాంటి మురుగు కాలువను చూసి గతుక్కుమంది. తారు రోడ్ల సుఖం తప్పించి కష్టమెరగని నేను ఈ దుమ్ములో అడుగు ముందుకి వెయ్యలేనని మొరాయించింది.

సత్యం విసుగ్గా సైకిల్ దిగాడు. సైకిల్ మట్టిలోనించి బలవంతంగా బయటికి లాగాడు. ఆ రోడ్డు పక్కన బిరుసెక్కిన సన్నని కాలిబాట మీదుగా సాగిపోయాడు.

నల్లగా, సన్నగా, కాయకష్టం చేసే జవరాలి వెన్నులాంటి గ్రాండ్ ట్రంక్ రోడ్డుతో సరసాలాడుతూంటుంది అవుటపల్లి. అక్కడ ముఖ్యంగా చూడదగినది వీరయ్య సైకిల్ షాప్ కమ్ బడ్డీకొట్టు. ఆ కొట్టులో కూర్చుని తన చదువునీ, భవిష్యత్తుని గురించిన కలల్నీ కలిపి మెలేసి పేనటం తప్పించి, సత్యనారాయణ కింతవరకూ ఇలాంటి కష్టం పడడం అనుభవం లేదు.

మట్టిరోడ్డు మీది కాలిబాట హఠాత్తుగా అంతర్థాన మయింది. సైకిల్ బెసిగి పక్కకి పడింది.

'దీం తల్లి — ముదనష్టపూరు!' కసిగా తిట్టుకుంటూ తను లేచి సైకిల్ని లేవదీశాడు సత్యం.

ఎంతటి వాళ్లచేతా అంతమాటా అనిపించుకోటానికి అన్ని అర్హతలూ ఉన్న ఊరు సూరవరం. తారు రోడ్డు కనిపించాలన్నా, బస్సు మోత వినిపించాలన్నా, ఎలక్ట్రిక్ వెలుగు కావాలన్నా సూరవరానికి చుట్టుపక్కల ఆరేడు మైళ్ల పరిధిలో అది సాధ్యంకాదు.

నాలుగు డబ్బులున్న వాళ్లూ, నాలుగు డబ్బులు కావాలనుకున్న వాళ్లూ ఎందరో ఆ ఊరు విడిచి పోయారు. కాని, సీతాపతి మాత్రం ఆ ఊరు వదలలేదు. సీతాపతి లాంటి కామందు ఆ చుట్టుపక్కల లేడు. అతను సూరవరానికి నాలుగు దిక్కులా ఉన్న బస్తీల్లో నాలుగు హోటళ్లు నడుపుతున్నాడు. అతనికి అంగబలం ఉంది. అందుకే అతను సూరవరంలోనే ఉండగలుగుతున్నాడు. నాలుగు హొటళ్లూ నడప గలుగుతున్నాడు. కో-ఆపరేటివ్ బాంక్ ప్రెసిడెంటుగా ఆ ఊరిని నడప గలుగుతున్నాడు.

సదరు సీతాపతి తాలూకు హోటల్లోనే సత్యం తండ్రి పిండి రుబ్బేది. "పెళ్లాం, పిల్లల్లే నాయున! ఆ డబ్బంతా ఏం జేసుకుంటాడు?" — కాబట్టి తనకి సాయం జేస్తాడేమోనని సత్యం ఆశ. తన హోటల్లో పిండి రుబ్బే కిష్టయ్య కొడుకంటే ఆ మాత్రం కనికరం ఉండదా? బుద్ధిగా చదువుకుని బి. ఏ. ఫస్ట్ క్లాసులో పాసై కాలేజీ ఫస్ట్ వచ్చాడంటే, తన మీద ఆమాత్రం సానుభూతి కలగక పోతుందా?

"ఆ మడిసి సంగతి నీ వెరగవు! పట్టి కక్కాడి

మడిసి! పైనకి పైన అతికించి పెడతాడుగాని, సస్తే సాయం చెయ్యడు!" అంటాడు వీరయ్య.

జూన్ నెల ఎండలో నాలుగు మైళ్ళు సైకిల్ తొక్కి మట్టి రోడ్డు మీదికి మలుపు తిరిగిన సత్యం, వీరయ్య మాటలు మనసులో మెదిలినప్పుడు నీళ్ళు కారిపోతున్నాడు. 'ఆశని చచ్చినా చావనివ్వను' అనుకుని మొండిగా ముందుకు పోతున్నాడు.

తనింకా ఆరు మైళ్ళు పోవాలి. తిరిగి రావాలి. ఎండ చెత్త మాడ్చేస్తూంది. చెమటకి ఒళ్ళంతా తడిసి చీదరగా ఉంది. కాళ్ళు చచ్చుబడుతున్నాయి. కళ్ళు తేలిపోతున్నాయి. నాలిక పిడచగట్టుకుపోతూంది.

మట్టిరోడ్డు క్రమక్రమంగా ఎత్తెక్కి, బ్రహ్మ రాక్షసుల్లాంటి రెండు తాడిచెట్ల మధ్య హఠాత్తుగా అంతర్థానమయింది. చిళ్ళకంప పరిహద్దుల్లో అణకువగా, ఇరుకుగా సాగిపోతున్న ఇసక డొంక సాక్షాత్కరించింది.

ఈదురోగోడో మంటూ, ఆ డొంక వెంబడే పెంకె సైకిల్ని బుజ్జగిస్తూ, బరబరా ఈడుస్తూ, మోసుకుంటూ ముందుకు సాగిపోయాడు సత్యం.

* * *

సూర్యుడు నడినెత్తిమీదినుంచి దిగుతూంటే ప్రెసిడెంట్ గారి ఇల్లు చేరాడు సత్యం. తేలితేలిపోతున్న సత్యానికి ఆ ఇల్లు చూస్తూంటే సప్త సముద్రాలు దాటిన రాజకుమారులంతా తనకి జోహార్లు అర్పిస్తున్నట్లనిపించింది.

సైకిల్మీద వాలిపోతూ, తూలిపోతూ ఆ ఇంటి ముందు పందిరి కిందికి చేరాడు సత్యం. అతని ప్రాణం కొద్ది కొద్దిగా తేరుకుంది.

ప్రెసిడెంట్ సీతయ్యగారి లోగిలి చాలా సందడిగా ఉంది. కూలి చేసే రైతునుంచి, ట్రాక్టరున్న రైతు వరకు అన్ని రకాల మనుషులతోనూ ఆయన ఇల్లు కిటకిటలాడుతూంది.

"శరభయ్యా! పుస్తకాలిక మూసెయ్య. వెంకయ్యా.! మీ లోన్ శాంక్షన్ కాలేదయ్యా! రాఘవులూ! లాభం లేదురా, నాయనా! వేలు ముద్దర అదే వెయ్యాలి. నా దగ్గిరా? డబ్బా? దమ్మిడీ లేదురా, నాయనా! ఇహ సర్లెండి, బాంక్ ప్రెసిడెంట్లంతా మాణిగే దిలాగే! ఇవాళ లోన్ శాంక్షన్ అయినవాడు రాలేదని వాడి డబ్బు ఇంకోడి కివ్వనా? రేపీపాటికి కటకటాల వెనకా లుంటాను. చాలు చాలు! వెళ్ళరా, బాబూ! వెళ్ళు. నీకో దణ్ణం! వీల్లేదు అన్నానంటే వీల్లేదు. అంతే!" చిరాగ్గా, హడావిడిగా చుట్టూ ముసురుకుంటున్న మనుషుల్ని తోసేసుకుంటూ లేచి నిలబడ్డాడు సీతాపతి.

వీళ్ళందర్నీ వదిలించుకుని సీతాపతి లేవబోతూంటే సత్యానికి ప్రాణం లేచి వచ్చింది. తొందర పుట్టింది. అనుమానం వచ్చింది. భయం వేసింది. ధైర్యం వచ్చింది.

ఎట్టకేలకు సాహసించి, "అయ్యగారూ!" అని పిలిచాడు సత్యం. సీతాపతి వినిపించుకోలేదు. మరి కొంచెం సేపాగి మెల్లిగా మళ్ళీ పిలిచాడు. సీతాపతి సత్యం వైపు తిరిగాడు.

సత్యం ఒళ్ళు ఆనందంతో పులకరించింది. వినయంగా దణ్ణం పెట్టాడు. సీతాపతిగారు ప్రశ్నార్థకంగా చూశాడు.

"కిష్టయ్యగారి కొడుకునండి!" — 'గారి' అన్న

**ప్రతి వ్యక్తికి ఆశలు, ఆదర్శాలు ఉంటాయి. వాటిని అమలులో పెట్టగల ఓర్పు, సహనం, అవకాశం కొందరికే ఉంటాయి. డబ్బుకు మనిషికి ఉన్న విలువ గ్రహించి, నేర్పుగా మసలుకోగలవాడు, కార్యాన్ని సాధిస్తాడు. లేనివాడు సన్యాసి అవుతాడు. డబ్బు విలువ మనిషి విలువ తెలిసినవాని మనస్సు తెలుసుకోవడం చాల కష్టం.**

మాటని మింగీ మింగనట్లు మింగుతూ గొణిగాడు సత్యం. "మీ గన్నారం హోటల్లో పనిచేస్తున్నాడండి" అని వివరించాడు.

బీరువాల తాళంచెవులు జేబులో పెట్టుకుంటూ, బల్లమీద వస్తువులు లెక్క చూసుకుంటూ పరధ్యానంగా, "ఓహో!" అన్నాడు సీతాపతి.

"ఏం పని?" అన్న చల్లని ప్రశ్నకి ఆత్రంగా ఎదురుచూస్తూ, చేతులు నలుపుకుంటూ నిశ్శబ్దంగా ఊరుకున్నాడు సత్యం.

సీతాపతి ఆ చల్లని ప్రశ్న వేయలేదు. "ఇహ మీరంతా వెళ్ళండ్రా!" అని ఆ మనుషుల్ని తోలేసి, "శరభయ్యా! పదినిమిషాల్లో వచ్చేసెయ్యి! ఊఁ! త్వరగా!" అని చిటిక వేసి, "అవ్వా! అన్నం పెట్టు!" అని పొలికేక పెడుతూ హడావిడిగా లోపలికి పోయాడు.

సీతాపతి భోజనం చేశాడు. హడావిడిగా చేతులు తుడుచుకుంటూ బయటికి వచ్చి గేట్లోకి తొంగి చూశాడు.

# ఆగష్టు 15

## దూపాటి సంపత్కుమారాచార్య

దేశ దాస్య విమోచనాశయ సిద్ధికై
తపియించు వారల త్యాగఫలము
దేశ భక్తిస్ఫూర్తి దీపింప రుధిరమ్ము
చిందజేసినవారి చివరి యూర్పు
దంభజీవుల యథార్థ స్వరూపమ్ము
దర్శింప నిల్పిన దర్పణమ్ము
అభ్యుదయ మార్గాల ననుగమింపగ జాతి,
మార్గమ్ము జూపించు మైలురాయి !
నేటి స్వాతంత్ర్య దినము యెన్నేళ్ళనాటి
ప్రాభవమ్ములకో యనుప్రాసమైన
తత్పురా భారతీయ సదాశయమ్ము
తరతరమ్ముల నిలుపు స్వాతంత్ర్య దినము !!

సత్యం ఆత్రంగా లేచి నిలబడ్డాడు. "కిష్టయ్య మా నాన్నగారే నండి!" అన్నాడు.

గేట్లోకి తొంగిచూస్తూ, "అవును! చెప్పావు!" అన్నాడు సీతాపతి. అతను ఎదురుచూస్తున్న మనిషి రావటం లేదు. సీతాపతి విసుక్కుంటూ సత్యంవైపు తిరిగాడు. "అవును. మీ అయ్య ఎప్పుడూ చెపుతూంటాడు, బి. ఎ. చదువుతున్నావుటగా?" అని అడిగాడు ఎటో ఆలోచిస్తూ.

మండుటెండలో పది మైళ్ళు సైకిల్ తొక్కిన సత్యానికి పండు వెన్నెలలో షికారు చేసినట్లనిపించింది.

"బి. ఎ. అయిపోయిందండి. ఫస్ట్ క్లాస్ వచ్చిందండి. కాలేజీకి ఫస్ట్ నేనేనండి. ఎమ్.ఎ.లో జేరదామని ..." ఈ ఒక్క క్షణంలో వివరాలన్నీ గుమ్మరించేస్తున్న సత్యం ఆగిపోయాడు.

"ఓహో! అలాగా!" అంటున్న సీతాపతి, "అమ్మ! వచ్చాడయ్యా!" అని పెద్ద కేకపెట్టాడు. "ఏమిటయ్యా, శరభయ్యా! ఇంతసేపా? నాజీపీడు వెళ్లటం ఎంత అర్జంటని చెప్పాను! లాభం లేదయ్యా! మీరంతా జాగారం మనుషులు." హడావిడిగా తెల్లని ఖద్దరు లాల్చీ మీద జరీ కండువా సర్దుకుంటూ సైకి లెక్కాడు సీతాపతి.

"చూడవోయ్! నీ పేరేమిటో ..."

"సత్యనారాయణండీ!"

"ఆఁ! అదే! ఏదో పనిమీద వచ్చినట్లున్నావ్! రేపు కనిపించు!" అని హడావిడిగా నిష్క్రమించాడు సీతాపతి.

మరో మాట కూడా మాట్లాడటానికి సత్యానికి ఆస్కారం లేకపోయింది. దిగాలు పడిపోయాడు.

* * *

"ఓరెయ్, సత్తెం! నీకు తెలవదురా, బాబూ, ఆడి సంగతి. నా మాటిను!" వెనకాలే వీరయ్య అక్షింత లేశాడు.

'చచ్చినా వినను!' మొండిగా అనుకుంటూ ముందుకు సాగాడు సత్తెం.

ఈసారి సత్యానికి ప్రయాణంలో ఒళ్ళు తెలియలేదు. నిన్నటి ప్రయాణం తన ప్రాణాలు తోడేసింది. చావు యాతన పెట్టింది. ఇదేమిటన్నట్లు, ఏ సంగతీ తేల్చకుండా, నిర్లక్ష్యంగా రేపు కనిపించమన్న ధోరణికి సీతాపతి అంటే కచ్చ పుడుతూంది. ఆ కచ్చ పట్టుదలగా మారుతూంది.

'ఆ మనిషి ఎలాంటివాడైనా సరే, ఈ యాతనకి ఫలితం దక్కించుకోవాలి! దక్కించుకు తీరాలి!' విసురుగా దూసుకుంటూ నూరవరం చేరాడు సత్యం.

దారిపొడుగునా కుతకుత ఉడుకుతున్న అతని ఉడుకు రక్తం సీతాపతి ఇల్లు చేరేసరికి చల్లబడిపోయింది. సైకిల్ దిగి, "అయ్యగా రున్నారా?" అని పాలేరుని అణకువగా అడిగాడు. ఆ పాలేరు చాలా నిర్లక్ష్యంగా, క్లుప్తంగా "లేరు!" అన్నాడు.

"ఎప్పుడు వస్తారు?" దిగులుగా అడిగాడు సత్యం.

"ఇప్పుడెక్కడ? పొద్దు గూకాల! రేపు కనిపించు!"

— అక్కడే నిలబడితే ప్రశ్నలతో ఎక్కడ వేధిస్తాడో అన్నట్లు పాలేరు విసుగ్గా వెళ్లిపోయాడు.

సత్యం ప్రాణం ఉసూరుమంది. తను మళ్ళీ పది మైళ్ళు వృథాగా సైకిల్ తొక్కాలి. పోనీ, ఆయన వచ్చేదాకా ఇక్కడే ఉండిపోతే? తను చద్దన్నం కూడా తిన

లేదు. అలా అని తనిప్పుడు సైకిల్ తొక్కగలడా? ఎండ చురుక్కుమంటూంది! మూడు మైళ్ళు తొక్కేసరికి సూర్యుడు నడినెత్తిమీదికి వచ్చేస్తాడు. తన పని కాలేదు. ఒంట్లో సత్తువ లేదు. మనసులో తృప్తి లేదు.

లేదు! తనిప్పుడు వృథాగా సైకిల్ తొక్కలేదు. తిరిగి రాలేదు. తిండి లేకపోయినా సరే! ఆ యాతన మాత్రం పడలేదు.

తిండీ, తిప్పలు లేకుండా సత్యం ఆ రోజంతా ప్రెసిడెంట్‌గారి పందిరి కింద గడిపేశాడు.

సూర్యుడు పశ్చిమాద్రిన అస్తమిస్తుంటే, సీతాపతి తన ఇంట్లో ఉదయించాడు.

సత్యం ఆదుర్దాగా లేచి నిలబడి దణ్ణం పెట్టాడు.

"అరే! రేపంటే రేపే వచ్చేశావే!" ఆశ్చర్యపోతూ సీతాపతి లోపలికి వెళ్ళాడు. వేడి వేడి నీళ్ళ స్నానంచేసి బట్టలు మార్చుకుని తాపీగా బయటికి వచ్చాడు. పాలేళ్ళకి పనులు పురమాయించాడు. ఎవరో మనుషుల కోసం కబుర్లు పంపాడు. ఆ పైన సత్యం వైపు తిరిగి, "చీకటి పడుతూంది. డొంకంతా చీకటి, నీకు వెళ్ళటం ఇబ్బందవుతుందేమో!" అన్నాడు.

ఆమాత్రం సానుభూతికి సత్యం చక్కలిగింతలు పెట్టించుకుంటున్న అనుభూతి పొందాడు. "ఫరవా లేదు లెండి! మీకు తీరిక చిక్కాక మీతో మాట్లాడి వెడదామనీ ..." అన్నాడు చేతులు నలుపుకుంటూ.

"ఐతే కానీ!" అన్నాడు సీతాపతి.

"నేను బి. ఎ. ఫస్టుక్లాసులో పాసయ్యానండి. కాలేజీ ఫస్టు నాదేనండి"—సహాయం పొందటానికి తన అర్హతలు ఏకరువు పెట్టాడు సత్యం.

"ఐతే ఇంకేం! కిష్టయ్యకి ఫలితం దక్కిందన్న మాట!"

"ఏదో మీలాంటి పెద్దల దయండి. వారు చేసిన సాయం వల్లే ఇందాకా వచ్చానండి!"

సీతాపతి మాట్లాడలేదు.

"ఇప్పుడు ఎం. ఎ. లో చేరదామని ..."

"ఎం. ఎ. దేనికి?" ఆశ్చర్యం ప్రతి అక్షరంలోనూ ధ్వనింపజేస్తూ అడిగాడు సీతాపతి.

"చదువుకుని పది మందికీ ఉపయోగ పడదామని..." సత్యం నసిగాడు.

సీతాపతి నోట్లోనుంచి బీడీ తీసేశాడు. కాలి పోతున్న కొన వంక చూస్తూ దాన్ని కొద్దిసేపు మునివేళ్ళతో తిప్పాడు.

"ఐతే, రేపు కనిపించు!" అని లోపలికి వెళ్ళి పోయాడు.

సత్యం మరోసారి జావగారిపోయాడు.

● ● ●

సత్యం రేపు కనిపించాడు. నూజివీడు హోటలుకి రంగులు వేయించటానికి పోతున్నాడు సీతాపతి. మళ్ళీ రేపు కనిపించాడు సత్యం. సీతాపతి ఊళ్ళో లేడు. మరో రేపు వచ్చింది. అప్పుడే పొలం నుంచి వచ్చిన సీతాపతి చాలా నీరసంగా ఉన్నాడు. "రేపు తప్పకుండా కనిపించు" అన్నాడు.


● ● ●

"అరేయ్! అణ్ణి తలుసుకుంటే ఒల్లు భగభగ మండుద్ది!" పళ్ళ పటపట కొరుకుతూ అన్నాడు వీరయ్య.


ఋతుక్రమం ఆలస్యమైతే?
విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన "దేవపిల్సు" వాడండి
Mfrs:- SEENU & CO. MADRAS-21
పెద్ద కెమిస్టులు, డ్రగ్గిస్టులు అందరి వద్దను లభిస్తున్నది
ప్రకటన G. O. Ms. No. 1121 క్రింద అనుమతించబడినది

ఐటెక్స్
సౌందర్య సాధనములు
ఐటెక్స్ కాటుక　ఐటెక్స్ బిందీ తిలకం
ఐటెక్స్ కుంకుం పేస్టు


ARAVIND LABORATORIES
P. B. 1415., MADRAS-17



జంతర్ మంతర్ (జయపూర్) ఫోటో—కె. రామకృష్ణారావు (చిత్రరంజన్)

సైకిల్ పెడల్ని విసుగ్గా తంతూ సత్యం ముందుకు సాగాడు. చెమటలు గక్కుతూ ప్రెసిడెంట్ ఇల్లు చేరాడు.

బాంక్ డబ్బు వచ్చింది. సీతాపతి ఇల్లు మళ్ళీ కిట కిట లాడుతూంది. ఆ డబ్బు పంచటంలో అతను నిండా మునిగిపోయాడు. సత్యాన్ని అతను గమనించే సరికి పావుగంట పట్టింది.

గమనించిన మరుక్షణం తక్కిన పని మానేసి "పాపం! వారం రోజులనించి చాలా శ్రమ పడుతున్నావోయ్! ఈ రోజు తప్పకుండా నీ పని పూర్తిచెయ్యాలి. ఒరే, నర్సయ్యా! లోపలికెళ్ళి జేబులో పర్సు ఇట్లా పట్రా!" అన్నాడు.

కోటివీణలు ఒక్కసారి మోగినట్లనిపించింది సత్యానికి. ఆనందబాష్పాలతో చెమ్మగిల్లిన అతని కళ్ళకి దేవుళ్ళాంటి సీతాపతి మసక మసకగా కనిపించాడు.

పర్సు వచ్చింది. దాన్ని విప్పి, బోర్లించి, విదిలించాడు సీతాపతి — ఒక పదిపైసల బిళ్ళా, ఐదు పైసల బిళ్ళా!

"ప్చ్! ఇంతే ఉందోయ్! ఏం చేస్తాం! ఇంతే ప్రాప్తం! తీసుకువెళ్ళు!" చాలా మామూలుగా అన్నాడు సీతాపతి.

సత్యానికి ఊచిపెట్టి చెంపమీద కొట్టించుకున్నట్లయింది. కళ్ళు బైర్లు కమ్మినాయి. ఆ ఇంట్లో కిటకిటలాడుతున్న జనం అంతా తనని చూసి పగలబడి నవ్వుతున్నట్లనిపించింది. వాళ్ళందరి మధ్యా తనొక చీమ అయిపోతే వాళ్ళంతా ఆనందిస్తున్న ట్లనిపించింది. సత్యానికి కళ్ళలో నీళ్ళు తిరిగినాయి.

బల్లమీద పదిహేను పైసలు!

వారం రోజులుగా ఆపసోపాలు పడి, ఈయన చుట్టూ తిరిగిన తనకి లభిస్తున్న ముష్టి!

వీరయ్య ఎంత చెబుతున్నా వినకుండా, తిరుగుతున్న తన పట్టుదల విలువ, వారం రోజులుగా మండు టెండలో, కటిక చీకట్లో నరకంలాంటి ఈ ఊరు చుట్టూ తిరిగిన తన శ్రమ విలువ, తన బి. ఎ. ఫస్ట్‌క్లాస్ విలువ, తన కాలేజీ ఫస్ట్ విలువ, తన ఆశయాల విలువ, ఆశల విలువ, బ్రతుకు విలువ — అన్నీ కలిపి పట్టి పదిహేను పైసలు!

కళ్ళెత్తి సీతాపతివైపు చూశాడు సత్యం.

ఎవరికో లోన్ డబ్బు ఇస్తూ డబ్బు కట్టలు లెక్క పెట్టుకుంటున్నాడు సీతాపతి.

'డబ్బు కట్టలు!' — అతనిలో ఉక్రోషం పరవళ్ళు తొక్కింది.

అవును! ఈ డబ్బు కట్టల వెలుగులో కళ్ళు మూసుకు పోతున్న ఈ మనిషికి తన విలువ ఎలా తెలుస్తుంది? తనదంతా వట్టి భ్రమ. ఏదో చదివి సంఘాన్ని ఉద్ధరిస్తా ననుకోవటం శుద్ధ తెలివితక్కువ. ఈ సంఘానికి కావలసింది డబ్బు! డబ్బు! డబ్బు!

'ఈ సంఘానికి కావలసింది డబ్బు! డబ్బు! డబ్బు!' బల్లమీద పదిహేను పైసలు దిక్కులు పిక్కటిల్లే టట్లు అరుస్తున్నట్లనిపించింది.

'సీతాపతీ! వారం రోజులు తిప్పి, తిప్పి నువ్వు నేర్పిన ఈ పాఠాన్ని ఎప్పటికీ మరువను!' — సత్యం ఆవేశాన్ని అణచుకుంటూ పదిహేను పైసలు అందుకున్నాడు సీతాపతికి దణ్ణం పెట్టి విసురుగా బయటికి వచ్చేశాడు.

వెళ్ళిపోతున్న సత్యంవంక క్షణంసేపు నిర్లిప్తంగా చూశాడు సీతాపతి. అతను స్టాండ్ తీసి బయల్దేర బోతూంటే, "ఒక్క మాట!" అని వెనక్కి పిలిచాడు. లోపలికి తీసుకెళ్ళాడు. తనతోపాటు మంచంమీద కూర్చోమన్నాడు. కచ్చ అణచివేసుకుని సత్యం కూర్చున్నాడు.

"నే నెలాంటి వాణ్ణో తెలుసా! నేను సంపాదిస్తున్న డబ్బు నేనే అనుభవించటానికి తీరికలేని వాణ్ణి. అంతంత మాత్రం సన్నాసులకి పైస ఇవ్వను." చాలా గర్వంగా అన్నాడు సీతాపతి.

ఆపైన బొడ్డులో ఏదో వెతుక్కుంటూ, "ఎమ్. ఎ. లో జేరటానికి నాలుగు వందలు చాలా?" అని అడిగాడు.

సత్యం అదిరిపడ్డాడు. అతని నోట మాట రాలేదు.

"ఆశలూ, ఆదర్శాలూ అందరికీ ఉంటాయి! కానీ వాటిని అమలులో పెట్టటానికి ఓర్పూ, పట్టుదలా కావాలి. ముఖ్యంగా ప్రతి చిన్నదానిదీ విలువ తెలుసుకుని ఉపయోగించుకోవటం నేర్చుకోవాలి. ఇది తెలియకే ప్రతివాడూ వట్టి సన్నాసిగా మారిపోతాడు." నాలుగు పచ్చనోట్లు బయటికి తీసి, ఇనప్పెట్టె మూసేశాడు.

"ఇందు, చాలా జాగ్రత్తగా వాడుకో! కావాలంటే అడుగు." సీతాపతి అంటున్నాడు.

గిర్రున కళ్ళలో నీళ్ళు తిరిగి, సత్యానికి తాను వెతుక్కుంటున్న సీతాపతి పాదాలు కనిపించలేదు! ★